క్లుప్తంగా

చిలమత్తూరును కరువు మండలంగా ప్రకటించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

చిలమత్తూరు: చిలమత్తూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ యూనిస్‌బాబుకు వినతి పత్రం అందించారు. సీపీఎం నాయకుడు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో వర్షాభావంతో పంటలు బాగా దెబ్బతిన్నాయని, అరకొరగా వచ్చిన పంటలను తుపాను ముంచిందన్నారు. అయితే కరువు మండలాల జాబితాలో చిలమత్తూరు మండలం లేదని, వెంటనే అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని గుర్తించి కరువు మండలంగా గుర్తించాలని కోరారు.

బోధనా సిబ్బంది కోసం దరఖాస్తుల ఆహ్వానం

పెనుకొండ: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పెనుకొండలో మెగా డీఎస్సీకి ఉచిత కోచింగ్ ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలోనే పలు సబ్జెక్టులు బోధించేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మ్యాథ్స్ మెథడాలజీ, సోషల్ , సైన్స్ , హిస్టరీ, జీకే, కరెంట్ అఫైర్స్, సైకాలజీ సబ్జెక్టులు బోధించాల్సి ఉంటుందన్నారు. అర్హత గల అభ్యర్థులు తమ బయోడేటాతో సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారిని సంప్రదించాలని కోరారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ప్రధాన రహదారి సమీపంలో తమ కార్యాలయం ఉందన్నారు.

ఘనంగా వాల్మీకి జయంత్యుత్సవం



జ్యోతులు మోస్తున్న భక్తులు

చిలమత్తూరు: మండల కేంద్రంలో సోమవారం వాల్మీకి జయంత్యుత్సవాన్ని బోయ కులస్తులు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అనంతరం వారు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చి వాల్మీకుల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలని కోరారు.

పావగడ: మహర్షి వాల్మీకి ఆశయాలు, సిద్ధాంతాలు కొనసాగించిన నాడే వాల్మీకి జయంతికి సార్థకత లభిస్తుందని స్థానిక నిడుగల్ వాల్మీకి ఆశ్రమాధిపతి వాల్మీకి సంజయకుమార స్వామి తెలిపారు. తాలూకాలోని దేవలకెరె గ్రామంలో సోమవారం నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. వాల్మీకి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. అనంతరం వాల్మీకి చిత్ర పటాన్ని గ్రామంలో ఊరేగించారు. మహిళలు జ్యోతులు మోశారు.

యూటీఎఫ్ మండల కమిటీల ఎంపిక

మడకశిర: పట్టణంలోని కేపీ పాఠశాలలో సోమవారం యూటీఎఫ్ స్వర్ణోత్సవాల కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. మడకశిర, రొళ్ల, గుడిబండ మండలాలకు సంబంధించిన ఈ సమావేశాల్లో జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, జిల్లా కార్యదర్శి తాహిర్‌వలి పాల్గొన్నారు. మూడు మండలాలకు సంబంధించిన యూటీఎఫ్ కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. మడకశిర మండల అధ్యక్షుడిగా మాలింగప్ప, ప్రధాన కార్యదర్శిగా జోగప్ప, గుడిబండ మండల అధ్యక్షుడిగా మూడ్ల గిరియప్ప, ప్రధాన కార్యదర్శిగా నరసింహప్ప, రొళ్ల మండల అధ్యక్షుడిగా అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కేశవ్‌ప్రసాద్ ఎంపికయ్యారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీధర్

రొళ్ల: ప్రతి విద్యార్థి కూడా మొక్కల పెంపకాన్ని అలవర్చుకుని పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని అలుపనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రత్నగిరి ఏపీజీబీ బ్యాంక్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా అడవులు–పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. రత్నగిరి ఏపీజీబీ బ్యాంక్ మేనేజర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సేవలకు మంగళం

- కూటమి సర్కారు నిర్ణయాలతో గందరగోళం
- సచివాలయాల్లో అందని కీలక సేవలు
- కులధ్రువీకరణ మొదలు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లకూ తప్పని తిప్పలు
- తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న జనం
- సంక్షేమ పథకాల ఊసేలేని వైనం



దేవరహట్టి గ్రామ సచివాలయం

గుడిబండ: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేస్తూ ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన తీసుకొచ్చారు. పట్టణాల్లో వార్డు, గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేస్తూ ప్రజలకు అత్యుత్తమ స్థాయి సేవలు అందుబాటులోకి తెచ్చారు. ప్రతి రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేయడంతో పాటు వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి సేవలు అందించారు. అయితే ప్రస్తుత టీడీపీ కూటమి సర్కారు సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా నిర్ణయాలు తీసుకుంటుండటంతో సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

'మడకశిర'లో 80 సచివాలయాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ల సేవల కొనసాగింపుపై నిర్ణయం తీసుకోకపోవడంతో వారి సేవలు నిలిచిపోయాయి. గతంలో సచివాలయాలకు అనుసంధానంగా రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌తో పాటు ప్రజలకు నిత్యం అవసరమైన సేవలను ఇంటి వద్దకే తెచ్చారు. మడకశిర నియోజకవర్గంలో 80 సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఉత్తమ సేవలు అందించారు. ఈ సచివాలయాల్లో సుమారు 790 ఉద్యోగులతో పాటు వందాలాది మంది వలంటీర్లు ప్రజలకు సేవలు అందించేవారు. సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రజల నుంచి నిత్యం దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేందుకు సచివాలయాలు పని చేస్తుండేవి. సామాజిక పింఛన్లు , ఇంటి స్థలాలు, బియ్యం కార్డులు, అమ్మఒడి, విద్యాదీవెన, ఆటోవాలకు వాహన మిత్ర ఇలా పదుల సంఖ్యలో సంక్షేమ పథకాలకు దరఖాస్తులను స్వీకరిస్తూ అర్హులకు ప్రభుత్వం నుంచి పథకాలను అందించడంలో కీలకపాత్ర పోషించేవి. ఆయా సచివాలయ పరిధిలో ఏ పథకాన్ని ఎంత మందికి, ఎంత సొమ్ము చెల్లించామనే విషయాలను స్పష్టంగా సచివాలయాల వద్ద బోర్డులు పెట్టి మరీ ప్రదర్శించేవారు. కానీ నేడు అవన్నీ మచ్చుకు సైతం కనిపించడం లేదు.

తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 35 విభాగాలకు సంబంధించి ప్రజలకు 545 ప్రభుత్వ సేవలు అందించే వారు. అయితే ప్రస్తుతం సచివాలయ ఉద్యోగులతోనే సామాజిక పింఛన్లను పంపిణీ చేయించడం, ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రచారం చేయడానికి మాత్రమే సచివాలయ ఉద్యోగులను ఉపయోగించుకుంటున్నారన్న విమర్శలున్నాయి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు తప్ప ఏ పథకానికి సంబంధించి దరఖాస్తులు స్వీకరించడం లేదని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డులు, నూతన పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు తదితర వాటికి సంబంధించి ఆన్‌లైన్ సైట్స్ ఓపెన్ కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. మరీ ముఖ్యంగా కులధ్రువీకరణ పత్రం, ఓబీసీ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ తదితర వాటి కోసం మీసేవ కేంద్రాలకు వెళ్తున్నామని, ఆ తర్వాత తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సేవలు పునరుద్ధరించాలి



సచివాలయ ద్వారా గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఎన్నో రకాల సేవలు అందుబాటులో ఉండేవి. వలంటీర్లు ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సచివాలయాల్లో దాదాపుగా అన్ని సేవలు నిలిచిపోయాయి. ఈ ప్రభుత్వం కూడా ప్రజలకు సచివాలయాల ద్వారా సేవలను కొనసాగించాలి.

– దినేష్, క్యాబ్ డ్రైవర్, గుడిబండ

సచివాలయం చుట్టూ తిరుగుతున్నా..

నాకు 5 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే నాకు తెలియకుండానే ఆ భూమిపై వేరేవాళ్లు పట్టా పాసు పుస్తకం పొందారు. విషయం తెలుసుకొని సచివాలయానికి వెళ్లాను. అయితే సచివాలయ సిబ్బందికి ఎన్నిసార్లు మొర పెట్టుకున్న పట్టించుకోవడంలేదు. సచివాలయం చుట్టూ ప్రదక్షణ చేస్తున్నాను. కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది.

-బొజ్జప్ప, గొల్లపల్లి, గుడిబండ మండలం

అన్ని వర్గాల వారికీ ఇబ్బంది



ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేసే పరిస్థితిలో కూటమి ప్రభుత్వం కనిపించడంలేదు. సచివాలయాల ద్వారా ప్రజలకు గతంలో అందించే సేవలను సైతం నిలిపివేయడం దారుణం. కూటమి ప్రభుత్వం రేషన్‌కార్డుల్లో మార్పులు, ఇంటి స్థలాలు, కొత్తగా పింఛన్లకు దరఖాస్తులు పెట్టుకొనే అవకాశం కల్పించాలి. ఆఖరికి విద్యార్థులు, ఇతరాత్ర వర్గాల వారు కుల ధ్రువీకరణ తదితర సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతుండటం సిగ్గుచేటు.

– డీఎల్ యంజారేగౌడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, గుడిబండ

పరిగి చెరువుకు గంగపూజ



పరిగి చెరువు వద్ద గంగ పూజ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



మరువ ప్రాంతానికి తరలివచ్చిన జనం

పరిగి: మండల కేంద్రంలోని పరిగి చెరువు మరువ పారడంతో సోమవారం గంగపూజ కార్యక్రమాన్ని అధికారులు ఘనంగా నిర్వహించారు. మరువ ప్రాంతంలో తలారుల, నీరుగంటి ప్రజల ఆధ్వర్యంలో నీటిలో ఉన్న గంగమ్మ తల్లి విగ్రహాన్ని వెలికి తీసి గుమ్మగట్ట ప్రాంత వాస్తవ్యులచేత ప్రత్యేక పూజల నిర్వహణ అనంతరం సారెను సమర్పించారు. అంతకు ముందు తొలుత చెరువు కట్ట ప్రాంతంలోని పన్నేడమ్మ (సప్తమాతృక) అమ్మ వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మరువ ప్రాంతంతో పాటు పరిగి మండల కేంద్రమంతా కిటకిటలాడింది.

సర్పంచ్‌ను పక్కన పెట్టిన అధికారులు

గంగపూజ కార్యక్రమానికి నామమాత్రంగా స్థానిక సర్పంచ్ లక్ష్మీదేవిని ఆహ్వానించారు. అయితే పూజ జరుగుతున్న ప్రాంతంతో పాటు పన్నేడమ్మ ఆలయంలో ఎక్కడా సర్పంచ్‌ను ఆహ్వానించకపోగా కనీసం గుర్తించడానికి సైతం వీల్లేకుండా అధికారులు టీడీపీ నాయకుల ప్రసన్నం చేసుకోవడానికి మాత్రమే ప్రయత్నించారన్న విమర్శలున్నాయి.

కెంచమాంబాదేవికి పూజలు

అమరాపురం: మండల పరిధిలోని గొడనకుంటలో వెలసిన వక్కలిగ సోమేనహళ్లి జానకల్లు కులదైవం కెంచమాంభదేవి జాత్ర మహోత్సవాల్లో భాగంగా తమ్మడేపల్లిలో సోమవారం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. గొంచికార్ ప్రకాష్ ఇంటి ఆవరణలో పట్టం కూర్చోబెట్టి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించారు.

రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న సభ్యులు

రొళ్ల: స్థానిక వెలుగు కార్యాలయ ఆవరణలో అర్ధ వార్షిక తనిఖీలో భాగంగా తనిఖీ బృందం సభ్యులు సునీత, కవిత తదితరులు మహిళ సంఘాల లావాదేవీలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సోమ, మంగళవారం రెండు రోజుల పాటు 45 గ్రామైక్య సంఘాల ద్వారా జరిగిన లావాదేవీలు, రికార్డులు పరిశీలిస్తామన్నారు.

సీజనల్ వ్యాధులపై నిర్లక్ష్యమొద్దు

మడకశిరరూరల్: మండలంలోని కల్లుమర్రి పీహెచ్‌సీ పరిధిలో సీజనల్ వ్యాధులపై నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా, హెల్త్ సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్ తెలిపారు. తురుకువాండ్లపల్లిలో సోమవారం సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు.

కార్తీక శోభ



హిందూపురం: అలంకరణలో శివయ్య



రొళ్ల మండలం కేజీ గుట్ట కాలనీలో అలంకరణలో బసవేశ్వరస్వామి



లేపాక్షి: అలంకరణలో వీరభద్రస్వామి

సాక్షిబృందం: కార్తీకమాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకొని శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.



హిందూపురం పరిధిలోని మేళాపురంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

గ్రామ కమిటీలతో వైఎస్సార్‌సీపీ బలోపేతం



తురకలాపట్నం గ్రామ కమిటీ సభ్యులతో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

రొద్దం: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా గ్రామ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. ప్రతి గ్రామంలోనూ పార్టీ కార్యవర్గ సభ్యులను ఎంపిక చేసి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తిరుగులేని మెజార్టీని సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. అలాగే గ్రామాల్లోని ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. రొద్దం మండలంలోని తురకలాపట్నం గ్రామ కమిటీని ప్రకటించారు. గ్రామ అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడిగా నాగేంద్ర, రైతు అధ్యక్షుడిగా అంజినమ్మ, మహిళా అధ్యక్షురాలిగా నరసమ్మ, బూత్ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా లింగప్ప, బీసీ సెల్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా కుమ్మరి నరేష్‌ను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, నాయకులు ఎస్ నారాయణరెడ్డి, సీ నారాయణరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిలకల రవి, విజయభాస్కర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

పెనుకొండ రూరల్: ఇంటర్ చదువుతున్న ఓ బాలిక కనిపించకుండా పోయింది. ధర్మవరం పట్టణానికి చెందిన ఇంటర్ విద్యార్థిని గుట్టూరు గ్రామానికి చెందిన సమీప బంధువుల ఇంటికి దీపావళి పండగ కోసం నాలుగు రోజుల క్రితం వచ్చింది. సోమవారం ఉదయం 11 గంటల నుంచి విద్యార్థి కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కియా పీఎస్ ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

ఆలయంలో చోరీ

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని కనుమ వేంకటరమణస్వామి ఆలయంలోని హుండీని దొంగలు దోచుకెళ్లారు. కియా పీఎస్ ఎస్‌ఐ రాజేష్ వివరాల మేరకు.. కనుమ వేంకటరమణస్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారన్నారు. హుండీలోని దాదాపు రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మహాసభలను జయప్రదం చేయండి

హిందూపురం టౌన్: డిసెంబర్ 1, 2వ తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన సీఐటీయూ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు.

పన్ను వసూళ్లపై దృష్టి సారించండి

హిందూపురం: గృహ, తాగునీటి కుళాయిల పన్నులు వసూళ్ల పురోగతి మరింత పెంచాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం కమిషనర్ మున్సిపల్ నోడల్ ఆఫీసర్స్, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. పన్నులు చెల్లించని వారికి నోటీసులు జారీ చేయాలన్నారు.

10 అర్జీలు

పెనుకొండ రూరల్: పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 10 అర్జీలు అందినట్లు డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి

మడకశిర: మడకశిర కేంద్రంగా రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వినతిపత్రాన్ని సమర్పించారు. నియోజకవర్గ ప్రజల సౌకర్యార్థం మడకశిరను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా మార్చాలన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించండి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెనుకొండ రూరల్: వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ హనుమంతుకు వినతిపత్రం ఇచ్చారు. ఎన్నికలకు ముందు ప్రస్తుత సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీమేరకు రూ.15 వేల కనీస వేతనం అమలు చేయాలన్నారు. నాయకులు రమేష్, అంజినప్ప, బాబావలి పాల్గొన్నారు.

బదిలీ ఆర్‌ఐకు సన్మానం

అమరాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐగా పనిచేస్తూ ఇటీవల రొళ్ల మండలానికి గిరియప్ప బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది గిరియప్పను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతీప్రకాష్, ఆర్‌ఐ విన్సెంట్‌పాల్, సర్వేయర్ పుట్టరాజు, సీనియర్ అసిస్టెంట్ రజిత తదితరులు పాల్గొన్నారు.

దొంగను పోలీసులకు అప్పగించిన స్థానికులు

గోరంట్ల: పట్టణంలోని విజయ్‌కుమార్ పెట్రోల్‌బంక్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని సోమవారం దొంగిలించే ప్రయత్నం చేసిన దొంగను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొంగను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు.

ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి విరాళం

లేపాక్షి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గాదేవి ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేశారు. కోడిపల్లి సర్పంచ్ రూ.20 వేలు, మాజీ సర్పంచ్ జయకృష్ణారెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, శంకర్‌రెడ్డి ఒక్కొక్కరు రూ.10 వేలు చొప్పున కమిటీ సభ్యులకు అందజేశారు.

సాగు పట్టాల కోసం ధర్నా



ధర్నాలో పాల్గొన్న రైతులు

సోమందేపల్లి: మండలంలోని తుంగోడు గ్రామ రెవెన్యూ పొలంలోని సర్వే నెంబరు 28లో రైతులకు సాగు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాయలం వద్ద ధర్నా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా పంటలు సాగు చేస్తున్నా పట్టాలు మాత్రం ఇవ్వలేదన్నారు.అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ రెడ్డిశేఖర్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీఈటీ

పరిగి (రొద్దం): మండలంలోని కేజీబీవీ విద్యార్థినులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాలలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 2న అనంతపురంలో జరిగిన అండర్ –19 విభాగంలో జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థినులు పాల్గొన్నారన్నారు. ఈ క్రమంలో కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు చందన, మైనవతి అద్భుత ప్రతిభను ప్రదర్శించి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 28, 29, 30 తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని పీఈటీ రాధ తెలిపారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా రామారావు



రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా డి.రామారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రెగ్యులర్ ఎంపీడీఓగా పని చేస్తున్న ఆజాద్ ఇటీవల రామగిరి మండలానికి బదిలీపై వెళ్లారు. అమరాపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రెగ్యులర్ ఎంపీడీఓగా పని చేస్తున్న డి.రామారావును ఉన్నతాధికారులు రొళ్ల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మాట్లాడుతూ మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

సంక్షిప్త సమాచారం

పెట్టుబడి సాయం అందించాలి

లేపాక్షి: 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి రైతుకూ పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందజేసి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన అనంతరం పెట్టుబడి సాయం అమలు చేయలేదు. వెంటనే పెట్టుబడి సాయం రైతులకు అందజేయాలి' అని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేసారు. ఈ మేరకు సోమవారం లేపాక్షి పంచాయితీ కార్యదర్శి రమేష్‌కు వినతిపత్రంను అందజేశారు.

నీటి ట్యాంక్ వేలం

లేపాక్షి: మండల కేంద్రంలోని బసవన వీధి పాఠశాల ఆవరణలో ఉన్న నీటి ట్యాంక్ శిథిలావస్థకు చేరుకోవడంతో పంచాయితీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ ఆదినారాయణ అధ్యక్షతన వేలంపాట నిర్వహించారు. రియాజ్ అనే వ్యక్తి రూ.13 వేలకు పాట పాడి దక్కించుకున్నారు.


అవార్డు గ్రహీతకు సన్మానం



నాగరత్నమ్మను సత్కరిస్తున్న ఉపాధ్యాయుల బృందం

అగళి: మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఒకేషనల్ ట్రైనర్ బ్యూటీ అండ్ వెల్నెస్ పనిచేస్తున్న నాగరత్నమ్మ జిల్లా ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలోనే సోమవారం ఆమెను ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ జాఫర్ , ఒకేషనల్ కోఆర్డినేటర్ కృష్ణ చైతన్య , ఉపాధ్యాయులు, సిబ్బంది నాగరత్నమ్మను అభినందించారు.

10న యూటీఎఫ్ మహా సభ



పోస్టర్లను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మడకశిర: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 10న జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు కే.భూతన్న, కార్యదర్శి సితాహీర్‌వలీ పిలుపునిచ్చారు. కే.భూతన్న మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పీఆర్సీని అమలు చేసి బకాయిపడిన డీఏ, పీఎఫ్, ఏపీజీఎల్ఐసీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

గుడిబండ డీటీగా కల్యాణ్



గుడిబండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల డిప్యూటీ తహసీల్దార్‌గా పి కల్యాణ్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. మండలాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.